# నిరీక్షణ

కావిలిపాటి విజయలక్ష్మి

చెంపా! ఆ అబ్బాయి యెవరు? అడిగింది స్టేషన్ మాష్టరు భార్య హిందీలో గిన్నెలు కడగటానికి వచ్చిన దాసీ మనిషిని.

"అమారా బేటా తలవంచి" నెమ్మదిగా చెప్పింది చెంపా.

ఆశ్చర్యంగా చంపా వైపు రాగి జుట్టు, తేనె కళ్ళు ఎర్రని శరీరచ్ఛాయా తెలుపుగా ఉన్న పదేళ్ళ ఆ అబ్బాయి వైపు మార్చి మార్చి చూసింది, స్టేషను మాష్టరు భార్య కమలమ్మ.

దీనికిలాంటి కొడుకెలా పుట్టాడబ్బా అని గొణుక్కుని గిన్నెలు వాకిట్లో పడేసింది. కమలమ్మ

కుళాయి దగ్గర బకెట్‌తో నీళ్ళు తెచ్చి చెంపా ముందు పెట్టగానే కొడుకు. అతన్ని కూర్చోమని చెప్పి గిన్నెలు తోమటం ప్రారంభించింది చెంపా.

వీపు చినిగిన బనియను, తొడలపైదాకా పైకి ఉన్న ఖాకీ నిక్కరూ, చింపిర వంకరగా చెరగిన క్రాపూ. తల్లి దగ్గరలో గొంతుకు కూర్చున్న అబ్బాయి వైపు నీ పేరు? అడిగింది కమలమ్మ వాళ్ళకి తెలుగు రానందున హిందీలోనే.

'టిబ్బూ,' చెప్పాడా అబ్బాయి.

నీ మొగుడెక్కడున్నాడు? కుతూహలం ఆపుకోలేక చెంపానడిగింది కమలమ్మ.


తెలియదన్నట్టు తలవూపింది చెంపా.

రాయఘడా దాటిన తర్వాత ఓ స్టేషనది. రైల్వే క్వార్టర్సు, ఒక ట్రావెలర్సు బంగళా, రెండు మూడు చిన్న ప్రయివేటు కిరాణా దుకాణాల వాళ్ళ ఇళ్ళుమాత్రమే ఉన్నాయక్కడ. అంతటా అడవి అల్లుకుపోయివుంటుంది. కొత్తగా కాపురానికి వచ్చింది ఆ ఊరు భర్తతో కమలమ్మ.

రాత్రి ట్రయినులో దిగి ఆ ఊర్లో అడుగు పెట్టిన కమలమ్మ చుట్టూతా ఉన్న అడవివైపు భయం భయంగా చూస్తూ 'ఈ ఊర్లో ఎలా వుంటున్నారబ్బా! భయంగా ఉండదూ? అసలీ క్వార్టర్స్‌లో ఎవరన్నా కాపురా లుంటున్నారా భార్యా పిల్లలతో! అని అడిగింది భర్త రాజారావుని.

అతనామె మాటలకు గలగలా నవ్వేస్తూ నయం, నేనొక్కడ్నిమాత్రమే ఉన్నాననలేదు. సిటీ అమ్మాయివి కదా! జంగిలీ ఊళ్ళెప్పుడూ చూసివుండవేమో! మరేం భయపడకు చాలామంది కాపుర ముంటున్నారు అన్నాడతను.

మీరు నైట్ డ్యూటీ చేస్తూంటారు.




నేనొక్కర్తినే ఇంట్లో ఉండలేను బాబూ. మీకూడా స్టేషను కొచ్చేస్తూంటాను.

మళ్ళీ నవ్వాడతను. చంపావ్. సాయం రౌతానీని ఏర్పాటు చేస్తాలే అంటూ.

వారి వెనుక లైటు పట్టుకు నడుస్తూన్న జమేదారుకి తెలుగు రాదు కనుక వారి మాటలు అర్థంకాలేదు.

ఉదయం కిటికీ తెరచి బయటకు చూసింది కమలమ్మ. అంతా అడవి. మళ్ళీ వెంటనే తలుపులు మూసేసింది.

ఏం భయమేస్తూందా తలుపులు మూసేశావ్? చిలిపిగా నవ్వాడు రాజారావు.

అవునన్నట్లు తలవూపి నేను మా వాళ్ళింటికి వెళిపోతాను అంది కమలమ్మ.

ఉద్యోగం రిజైన్ చేసి నీ వెంట వచ్చేస్తాను అన్నాడు రాజారావు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

తాము తెచ్చుకున్న కేరేజి గిన్నెలు మరికొన్ని వంటకని తెచ్చిన గిన్నెలూ రాజారావు వంటచేసుకునే గిన్నెలు అన్నీ బాత్‌రూమ్‌లో పడేసి, రౌతానీ అన్నారు ఏదీ కబురు చెయ్యండి అంది కమలమ్మ భర్తతో.

ఈ గిన్నెలన్నీ చూస్తే అది పారిపోతుంది. నేను ఈ అమ్మగారి దగ్గర పని చెయ్యను బాబోయ్ అని. సంగోరు కడిగేసుకో కబురు చేస్తాను దానికి అన్నాడు రాజారావు.

నిజమే అనుకున్న కమలమ్మ అలానే చేసింది.

తొమ్మిది గంటల ప్రాంతాన పాతికా ముప్ఫయి మధ్య వయస్సు యువతి ఒడ్డి కట్టు చీర, రవికతో నమస్కార్‌మా అని చేతులు వినయంగా జోడిస్తే, తుమ్...అని ఆగిపోయింది కమలమ్మ.

తమ ఇంటి దాసిని. అని హిందీలో

చెప్పిందామె. వాళ్ళు హిందీ ఒరియా కలిపి మాట్లాడుతుంటారు. తమ పుట్టిల్లు టాటానగర్ కావటం వలన కమలమ్మకి భాషరాదనే ఇబ్బందిలేదు.

గబగబా గిన్నెలు కడుగుతూంది చెంపా. దొరలాటి కుర్రాడు నీకెలా పుట్టాడు. ఇలాటి కొడుకు అని చెంపాని అడిగి తెలుసుకోవాలని చాలా ఉబలాటంగా ఉంది కమలమ్మకి. కాని ఆమెతో తన పరిచయం ఇవ్వాళే. ఎంత దాశీదయినా ఏమనుకుంటుందో, అని అప్పటికా ప్రశ్న వెయ్యకుండా ఊరుకుంది.

వారం రోజులు గడిచాయి. చెంపా చాలా నెమ్మదయిన మనిషి, అంతేకాదు ఒకనాడు ఈ పని నువ్వు చెయ్యాలి అని చెపితే మర్నాటి నుంచీ మరి చెప్పనక్కరలేదు, చకచకా పనులు చేసుకుని వెళ్ళిపోతుంది. తనకై తానేమీ మాట్లాడదు. రాజారావు డ్యూటీకి వెళ్ళే ముందు వస్తుంది. కమలమ్మ గదిలో ఆమె మంచం దగ్గరలో ఒక నులక మంచం వాల్చుకుని పడుకుంటుంది. 'ఈ వారం రోజుల్లో నీ కా కొడుకు దొరికాడా? లేక పుట్టాడా? అని అడగాలని చాలాసార్లు ప్రయత్నించింది కమలమ్మ. కాని మౌనంగా వుండిపోయే చెంపాతో ఆ సంభాషణ ఎలా ప్రారంభించాలో, ఎలా అడగాలో తెలియక, తీరా అడిగేస్తే తననేం అపార్థం చేసుకుంటుందో అని జంకుతోను, వ్యక్తిగత విషయాలు ప్రశ్నించే వ్యక్తని తన పని మానుకుంటుందేమో అనే భయంతోనూ అడగలేకపోయింది.

నల్లగా మొద్దులా వుండే చెంపాకి,ఆ ఎఱ్ఱటి కుర్రాడెలా పుట్టాడండీ! భర్తని అడిగింది ఓ రోజు మధ్యాహ్నం.

వచ్చింది అనుమానం! నాకూ తెలియదు. చెంపా గురించి ఏవేవో కథలు చెప్పుకుంటారు. ఈ ప్రశ్న దాన్నే వెయ్యకపోయావా? అన్నాడతను,

ఏమనుకుంటుందో...ఏమిటాకథలు? కుతూహలంగా అడిగిందామె.

ఆ కొడుకెవరో దొరకి పుట్టాడంటారు. దీనికి పెళ్ళి పెటాకులూ లేవట. మనిల్లూ మరో రెండిళ్ళల్లో పనిచేసి పాతికా ముప్పయి రూపాయలు సంపాయిస్తూంది. అంతవరకూ నాకు తెలుసు. అన్నాడతను.

ఆ నాటినుంచీ మరీ కుతూహలం ఎక్కువయింది కమలమ్మకి.

నీ కొడుకుని తీసుకురావేం? వాడెక్కడ పడుకుంటాడు? అడిగింది ఓ రోజు రాత్రి తన మంచం పక్కన మంచం వాల్చుకని పడుకుంటూన్న చెంపాని.

మా నాన్న దగ్గర, చెప్పింది చెంపా.

నేను ఒకమాట అడుగుతాను ఏమీ అనుకోవుకదూ?

అడగండమ్మా. అనుకోవటానికేముంది? నవ్వటోయింది చెంపా.

నువ్వు మామూలు మనదేశపు మనిషిలా ఉంటావు కాని....

నా కొడుకు దొరబిడ్డలా ఉంటాడు. అదేకదమ్మా. మీ అనుమానం. చాలా మందికి తెలుసనుకుంటాను. వాడు నాకెలా పుట్టాడో ఛోటా బాబుకి తెల్సే ఉంటుంది. మీకు చెప్పలేదా? అదోలా నవ్వుతూ అడిగింది చెంపా.

ఛోటాబాబుకి తెలియదట నీకు అభ్యంతరంలేకపోతే చెప్పు మోసపోయావా?

అవునమ్మా ... అంతే చెప్పింది చెంపా. అంతకన్నా ఎలా మోసగించగించబడిందీ చెప్పలేదు చెంపా.........

ఎవరికీ చెప్పదు.

వత్తిగిలి కనులు మూసుకున్న చెంపా కనుకొలకుల్లో నీటిబొట్లు నిలిచాయి.

ఆమె మనసు గతంవైపు నడిచింది.

* * *

అవ్వాళ ట్రావెలర్సు బంగళా ముందు జీపు ఆగింది. వాచ్‌మెన్ బుద్ధూ హడావుడిగా జీప్‌దగ్గరకొచ్చాడు. జీపులోంచి పొడవాటి దొర దిగాడు. అతని వెనుక తెచ్చుకున్న సామాన్లు బంగ్లాలో చేరవేశాడు బుద్ధూ.

తర్వాత టీ తయారుచేసి తెచ్చాడు, టీలో బ్రెడ్ నంజుకు తింటూ, వంట నువ్వు చేస్తావా అడిగాడు దొర.

పాతిక సంవత్సరాల వయస్సులో చురుగ్గా ఉండే దొరవైపు ఓసారి చూసి నవ్వి, చేస్తాను సర్ అన్నాడు బుద్ధూ. బుద్ధూ మాట్లాడే ఒరియ, హిందీ కలసిన భాషే దొర చక్కగా మాట్లాడుతూంటే ఆశ్చర్యంగా ఉంది బుద్ధూకి.

దొరగన్‌పట్టుకొని అడవిలోకి వెళ్తూ, కొంచెం డబ్బులు బుద్ధూకిచ్చాడు.

దొర పేరు ఏమిటో తెలియదుకాని, అతన్ని అందరూ లంచా సాబ్ అనటం ప్రారంభించారు. అతను ఉదయం టీ, రొట్టె తీసుకున్నాక వేటకు వెళ్తాడు. మళ్ళీ సాయంత్రం షికారుగా తుపాకి చేత్తో పట్టుకొని అడవిలో తిరుగుతాడు.

బుద్ధూ కూతురు చెంపా సాయంతో వంటచేస్తాడు. చెంపాకి పద్దెనిమిదేళ్ళ వయస్సుంది. ఆమెను ఇవ్వమని పెళ్ళి చేసుకుంటామని ఎందరో వాళ్ళ జాతి యువకులు అడిగారు. కాని ఆమెకు తగిన వారు వీళ్ళుకాదని నిరాకరిస్తూ వస్తున్నాడు బుద్ధూ. వాళ్ళ జాతిలో ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకోవటం వంటి రాక్షస వివాహం కూడా ఆచారంలో ఉంది. ఆ అవకాశం కోసం ఎదురు చూసేవారూ ఉన్నారు అయితే చెంపా బంగ్లా ఆవరణలో ఉన్న వారింటి గడపదాటి ఎక్కడికీ వెళ్ళదు.

దొరవచ్చి వారందాటింది. ఎన్నాళ్ళుంటాడో ఎప్పుడు వెళ్తాడో తెలియదు. ఒక్కోరోజు రాత్రి బాగా తాగి పియానో వాయిస్తూ పాట పాడతాడు. ఆ పాటా,

ఆ వాయిద్యం, చెంపా చెవుల కెంతో ఇంపుగా వినిపిస్తాయ్. అతను వాకిట్లో కూర్చుని పాడుతూంటే ఆమె గుబురుగా ఉన్న మందార చెట్టు చాటున నిల్చుని, అతని వైపే తన్మయంగా చూస్తూ పాట వింటుంది.

ఎంత బాగుంటాడు. లంచాసాబ్, ఎంత చక్కని పాట పాడుతాడు ! అని ఏ వంద సార్లను కుందో చెంపా.

మత్తుగా ఊగిపోతూ పియానో వాయిస్తూ తేలిపోయె గొంతుతో ఏదో పాడుతున్నాడు దొర. మందార చెట్టు కొమ్మలు కదిలాయ్.

గమనించిన దొరగన్‌లో తూటాలు బిగించాడు.

దొర తుపాకి తనవైపు గురిపెట్టడం చూసింది చెంపా. సాబ్ నేను అంటూ కెవ్వున అరచి అతని ఎదర కొచ్చి నిల్చుంది.

నువ్వెవరు ? ఎందుకు వచ్చావ్ ? అని అడిగిన దొర కనుబొమలు ముడి పడ్డాయ్.

ఆ చెట్టు చాటున నిల్చుని మీ పాట రోజూ వింటాను మీ రెంతో బాగా పాడతారు. ఇంకెంతో బాగుంటారు. తడ బాటుగా అలా ఒక్కసారిగా అతని ఎదర నిల్చోవటం వల్ల బిడియంగా అంది చెంపా.

అలాగా అన్నట్లు తలపకించింది. చిన్నగానవ్వి రా కూర్చో అని తన పక్కచోటు చూపించాడు దొర.

అతనిపక్కన కూర్చుంది చెంపా.

అతను మళ్ళీ పాట మొదలుపెట్టాడు. బుద్ధూ గాఢ నిద్రలో ఉన్నాడు.

అతని సాన్నిధ్యంలో, కూర్చుని అతని పాట వింటూ అతని రూపం పరికిస్తూ మత్తుగా అరమోడ్పు కన్నులతో ఈ ప్రపంచాన్నే విస్మరించింది చెంపా పరవశంతో.

ఇలా నాలుగు రాత్రులు గడిచాయి. బుద్ధూ నిద్రపోగానే వచ్చి దొరపక్కన కూర్చుంటుంది చెంపా.

ఓరోజు తన దగర్లో కూర్చున్న చెంపా దగ్గరగా జరిగి పాట బాగుందా ! అడిగాడు లంచాసాబ్.

అతనిశరీరం తనశరీరాన్ని తాకుతూంటే సన్నగా వళ్లు పులకిస్తూంటే మత్తుగా తల ఊపింది చెంపా.

మరొక ఐదునిమిషాలు గడిచాక దొర చెయ్యి చెంపా నడుముని చుట్టి బిగుసుకుంది.

ఆ చెయ్యి విడిపించుకోవాలని ప్రయత్నించి లాభంలేక, పెళ్ళిచేసుకుంటారా? అని అడిగింది లోతుకుపోయిన స్వరంతో చెంపా.

సాదీ—అంటూ పెక్కున నవ్వాడు లంచాసాబ్.

ఆ నవ్వులోని అర్ధం లోతులూ తెలియవు చెంపాకి. అతని చేతులు తనను చుట్టుకుని దగ్గరకు లాక్కుంటూంటె.

అతను తనను పెళ్ళి చేసుకోవటం ఇష్టమయే, ఇలా చేస్తున్నాడనుకొని అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

అతను ఆశగా ఆకలిగా ఆమెను ప్రతిరోజూ అనుభవిస్తున్నాడు. 'లంచా సాబ్. చదువుకున్నవాడు. ఆఫీసరు.తన భర్త అని మురిసిపోయి తన అదృష్టానికి తానే గర్విస్తూంది చెంపా.

నెలరోజులు గడిచాయి. పెట్టె బెడ్డింగూ సర్దుకొని జీప్‌లో కూర్చున్న లంచాసాబ్ వైపు దీనంగా చూసింది చెంపా. అతనామె ఉనికిని గమనించనే లేదు. జీపు వెళ్ళిపోయింది. మళ్ళి ఎప్పుడు వస్తావ్? అని అడగాలనుకున్న చెంపా పెదవులు విడనేలేదు. ఆమె అడుగులు ముందుకు పడలేదు. స్థాణువులా చేష్టలుదక్కి, జీపు వెళ్ళినవైపు చూస్తూ ప్రతిమలా నిల్చుంది కొంచెం సేపు. తర్వాత దోసిట్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. అతను తనతో మాట మాత్రమన్నా చెప్పకుండా వెళ్ళిపోయాడని ఏడ్చింది కాని. తనను మోసగించి వెళ్ళిపోయాడని అనుకోలేకపోయింది.

బంగ్లాకి ఏ ఆఫీసరు వచ్చాడన్నా ఆతృతగా లంచాసాబ్ వచ్చాడేమో అని చూస్తూంది చెంపా. నిరాశగా వెనుదిరిగి వెళ్ళిపోతుంది. రెండు నెలలు గడిచాయి. తండ్రి దగ్గర మరీ రహస్యం దాచలేకపోయింది చెంపా.

లంచాసాబ్ ఎప్పుడు వస్తాడు? అని అడిగింది ఒకరోజు తండ్రిని.

మళ్ళివస్తాడని చెప్పలేమమ్మా,ఉద్యోగస్థులు కదా, దేశమంతా తిరుగుతారు. అన్నాడతను.

లేదు. తప్పక మళ్ళి వస్తాడు. అంది చెంపా.

నవ్వి ఊరుకున్నాడతను.

అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడు. రెండు క్షణాల తర్వాత నెమ్మదిగా చెప్పింది చెంపా.

బుద్ధూ వెట్టిదానివైపు, ఉత్త అమాయకురాలివైపూ చూసినట్లు చూసి నవ్వి ఆ లండన్‌దొర ఈ అడవిపిల్లను పెళ్ళి చేసుకుంటాడా, హాస్యమాడాడు కాబోలు నిన్ను అన్నాడు.

హాస్యంకాదు. నిజం. మేమిద్దరం భార్యాభర్తల్లానేతిరిగాం-అందిచెంపాసిగ్గుపడుతూనే భయంభయంగా తండ్రివైపు చూసింది చెంపా.

అబె అంబె ఏమిటమ్మా కంగారు పడిపోతున్నాడతను,

లంచాసాబ్ చాలా మంచివాడు.అంత పెద్ద ఆఫీసరు, చదివినవాడూ అబద్ధం ఆడడు. అన్యాయంచెయ్యడు. నన్ను పెళ్ళిచేసుకుంటానని చెప్పాడు. మళ్ళి వస్తాడు, నాన్నా అని ఏడ్చేసింది చెంపా.

ఏడవకు అలానె వస్తాడులే. అని కూతురు అమాయకత్వానికి జాలిగా దగ్గ

రకు తీసుకు ఓదార్చాడు. కాని తర్వాత చెంపా గర్భవతి అని నలుగురూ గుసగుసలాడుతూంటే కూతుర్ని చంపాలన్నంత కోపం వచ్చిందతనికి. చెయ్యెత్తి తనపైకి వచ్చే తండ్రి కాళ్ళకు చుట్టుకుంది చెంపా. లంచాసాబ్ ఇంక రాడు నన్ను చంపెయ్, అంటూ. జాలితో ద్రవించిపోయిందతని పితృహృదయం. మౌనంగా ఆమెను లేవనెత్తి దగ్గరకు తీసుకొని ఓదార్చాడు.

కుల పెద్దలు పంచాయితీలో బుద్ధూని, చెంపాని కులంనుంచి బహిష్కరించారు.

చెంపా. అచ్చం లంచాసాబ్ పోలికలు పుణికిపుచ్చుకున్న కొడుకుని కన్నది.

ఇప్పుడు బుద్ధూకి చెంపాకు కులం వాళ్ళతో సంబంధ, బాంధవ్యాలు లేవు. బుద్ధూ బంగ్లా వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. చెంపా రెండు మూడు ఇళ్ళలో పనిచేస్తూంది. టిబ్బూ అంటె ప్రాణం బుద్ధూకి.

ఆనాడునుంచి ఈనాటివరకూ బంగ్లాకేదన్నా జీపు వచ్చిందంటే. ఎవరన్నా వచ్చారంటే. లంచాసాబ్ వచ్చివుంటాడు అని ఆత్రుతగా, స్పందించే హృదయంతో తడబడే అడుగులతో బంగ్లాకు వెళ్ళి వచ్చినవారిని చూసి నిరాశగా నిస్పృహగా వెనుదిరిగి కమల నీరు నింపుకుంటుంది చెంపా. తీరిక చిక్కినప్పుడల్లా లంచాసాబ్ మాటలూ అతని రూపం, అతని ప్రవర్తనా,గతం నెమరు వేసుకుంటూ ఆస్మృతులతో పరవశించిపోతుంది. లంచాసాబ్ ఏ నాటికన్నా వస్తాడు అనుకుని తృప్తిపడుతుంది.

ఎలా మోసపోయావ్? అని రెండు మూడుసార్లు అడిగింది కమలమ్మ.

టిబ్బూతండ్రి రానివ్వండి చెబుతాను. నేను మోసపోయానో లేదో నాకు తెలియదు. టిబ్బు తండ్రి చాలా మంచివాడు. తిరిగి నాకోసం వస్తాడు ఎప్పటికైనా అంది చెంపా.


ఆమె విశ్వాసానికి, నమ్మకానికి జాలిగా సానుభూతిగా చూసింది చెంపా వైపు కమలమ్మ.

మర్నాడు భర్తతో దానికా దొరపైన ఎంత నమ్మకమో పాపం పిచ్చిది ఇంకా తనకోసం వస్తాడంటుంది చెంపా అంది కమలమ్మ.

తను ఫారెస్టు ఆఫీసరుగా వచ్చాడట అప్పుడు దీన్ని నమ్మించి ఆశను తీర్చుకునిపోయాడు. మళ్ళీ వస్తానని చెప్పి ఉంటాడు. ఇది వాడికోసం ప్రతిక్షణం ఎదురుచూస్తూ బ్రతుకుతూందట లంచాసాబ్ వచ్చాడు అని కుఱ్ఱకారు దాన్ని ఉడికిస్తూంటారట. కాని చాలా మంచి మనిషి కదూ? అన్నాడు రాజారావు.

మంచిదేకాని ఎప్పుడన్నా లంచాసాబ్ దీనికోసం వస్తాడంటారా?

గలగలానవ్వి వాడు దీన్ని ఎప్పుడో




మరచిపోయి ఉంటాడు. అన్నారతను.

రెండు సంవత్సరాలు గడిచాయి.

ఓ రోజు ఉదయాన్నే బంగ్లాముందు జీపు ఆగింది. జీపులోంచి పొడవాటి దొరా, దొరసాని ఇద్దరు పిల్లలూ దిగారు

ఇప్ప చెట్టుచాటునుంచి ఒళ్ళంతా కనులు చేసుకుచూస్తూంది చెంపా.

బుద్దూ, టిబ్బూ జీపు దగ్గరకెళ్ళి నమస్కరించి సామాన్లు బంగ్లాలో చేరేశారు.

దృష్టి మందగించిన బుడ్డా దొర వైపు గుచ్చిగుచ్చి చూడటం మొదలు పెట్టాడు.

దొర హడావుడిగా పి. డబ్ల్యు. బంగ్లా వైపు జీపులో మళ్ళి వెళ్ళి పోయాడు.

దొరసానమ్మ పిల్లలూ బంగ్లాలో స్నానాలుచేసి టీ త్రాగి రొట్టెలుతిన్నారు. చెంపా చకచకా వాళ్ళకన్నీ అమరుస్తూంది.

వచ్చినతను లంచాసాబ్ అవునా కాదా? అనే సందేహంతో, మనస్సు మనస్సులో లేదు చెంపాకి. ఏ పనీ చేత పట్టడం లేదు.

మళ్ళి పది గంట వేళ మరికొంత మందితో వచ్చాడు బంగ్లాకి దొర. భోజనాలయ్యాయి. పన్నెండు ప్రాంతాన్నగాని అతన్ని దగ్గరగా చూడటానికి అవకాశం కుదరలేదు చెంపాకి.

సాయంత్రం మళ్ళీ సామాన్లు జీపులో చేరవేశాడు బుద్దూ. దొరసానీ. పిల్లలూ వెళ్తూ టిబ్బూ చేతిలో పది రూపాయల కాయితం వుంచారు.

జీపురోడ్డుమీంచి దూసుకుపోతూంటే దీనంగా అటే చూస్తూన్న చెంపాకనుల్లో నీటి తెరలు వాలి మసగలు కమ్మాయి చూపులు.

లంచాసాబ్ అని చాలామంది గుసగుస లాడారు. విన్నది చెంపా.

నాతో మాట్లాడటానికి ఆతనికి వీలవ లేదు. మళ్ళి వస్తాడు అనుకుంది.

మళ్ళి నిరీక్షిస్తుంది లంచా సాబ్ రాక కోసం.